సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 28 | ఆగస్టు | 2024



బీసీఐ అనుమతి నిరాకరణ

యూనివర్సిటీ అధికారులు గ్యారంటీ డిపాజిట్ ఫీజు చెల్లించకపోవడంతో ఈఏడాది లా కాలేజీకి బీసీఐ అనుమతి నిరాకరించింది.

- 8లో▸



ఫోర్ట్ రోడ్డులో అగ్నిప్రమాదం

వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఇనుక అడ్డా జంక్షన్ సమీపంలో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$31^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

రేపు జేఎన్‌ఎస్‌లో క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవ (మేజర్ ధ్యాన్ చంద్ జయంతి) సందర్భంగా ఈ నెల 29న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ జి.అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, రెజ్లింగ్, స్విమ్మింగ్, లాన్ టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు గురువారం ఉదయం 9గంటలకు స్టేడియంలో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్య కేంద్రాల సందర్శన



ఎంజీఎం: సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా మంగళవారం ఎల్కతుర్తి, ఆత్మకూరు, ఉప్పల్, పెద్దమ్మగడ్డ ఆరోగ్య కేంద్రాలను ప్రోగ్రాం అధికారులు సందర్శించారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదవుతున్న సీజనల్ వ్యాధులు, ఇంటింటా జ్వర సర్వే జరుగుతున్న తీరును తెలుసుకొని వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ మహేందర్, క్షయ నియంత్రణ విభాగం జిల్లా అధికారి డాక్టర్ హిమబిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్, ఎంహెచ్‌ఎన్ ఇన్‌చార్జ్ పీఓ నాగరాజు పాల్గొన్నారు.

పల్లె దవాఖానల్లో ఇక హెచ్ఐవీ పరీక్షలు



ఎంజీఎం: జిల్లాలోని పల్లె దవాఖానల్లో ఇక నుంచి హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ టి.మదన్‌మోహన్‌రావు వైద్యాధికారులకు తెలిపారు. మంగళవారం ఎంజీఎంలోని అకాడమిక్ హాల్‌లో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, ఏఎస్‌ఎంలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఐవీకి సంబంధించిన వివిధ అంశాలతో పాటు టెస్టింగ్ మార్గదర్శకాలు, అలాగే టెస్టింగ్ విధానాన్ని చూపించారు. అనంతరం మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఐసీటీసీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉండగా.. సెప్టెంబర్ మొదటి వారం నుంచి పల్లె దవాఖానల్లోనూ అందుబాటులోకి రానున్నాయన్నారు. వివిధ లైంగిక సంబంధిత వ్యాధులను వివరించి హైరిస్క్ గ్రూప్‌లు, గర్భిణులకు తగిన కౌన్సెలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. శిక్షణలో క్షయ నియంత్రణ జిల్లా అధికారి హిమబిందు, మాస్ మీడియా జిల్లా అధికారి వి.అశోక్‌రెడ్డి, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా మేనేజర్ స్వప్న మాధురి, ఐసీటీసీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఎంజీఎం అధ్వాన స్థితికి..

ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ట్వీట్

ఎంజీఎం: 'కాంగ్రెస్ పాలనలో ఎంజీఎం ఆస్పత్రి పూర్తి అధ్వాన స్థితికి చేరుకుంది. ఎంజీఎంలో మందుల కొరతతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు లేవని చేతులెత్తేయడంతో చేసేదిలేక రోగులు ప్రైవేట్ ఫార్మసీలకు వెళ్తున్నారు' అని 'ఎక్స్'లో మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్వీట్ చేశారు. చాలా మంది పేదలు మందులు కొనలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో ఔషధాలు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ట్వీట్‌లో ఆయన పేర్కొన్నారు.

మొరం అక్రమ తవ్వకాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని ఎస్సారెస్పీ భూముల్లో మొరం అక్రమ తవ్వకాలపై నీటి పారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. 'అర్ధరాత్రి అక్రమ దందా' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఏఈ శ్రీనివాస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూముల తవ్వకాలు ఎలా చేపట్టారో పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అర్ధరాత్రి మొరం తరలిస్తున్నారని స్థానికులు ఏఈకి వివరించారు. మొరం తీసుకెళ్లే వాహనాల తాకిడి వల్ల కంటిమీద కునుకు లేకుండా పోతోందని వాపోయారు. అక్రమార్కులపై కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రాత్రివేళ గస్తీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రామప్ప ఆలయం వద్ద గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్ తదితరులు



లక్నవరంలో తీగల వంతెనపై నడుస్తూ సరస్సు అందాలను వీక్షిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ఆద్యంతం.. ఆధ్యాత్మికం

ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో సాగిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన

- రామప్ప, కోటగుళ్ల సందర్శన అదృష్టమన్న వర్మ
- ఆదివాసీలు, గిరిజనుల పథకాలపై సమీక్ష.. చిత్తశుద్ధితో కృషి చేయాలని అధికారులకు సూచన
- రచయితలు, కళాకారులకు అభినందనలు మంత్రి సీతక్కకు ప్రశంస
- లక్నవరంలో రాత్రి బస.. నేడు, రేపు ఉమ్మడి జిల్లాలో కొనసాగనున్న టూర్

సాక్షిప్రతినిధి, వరంగల్/ములుగు/వెంకటాపురం (ఎం)/భూపాలపల్లి/గోవిందరావుపేట : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పర్యటన ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు మంగళవారం మధ్యాహ్నం రోడ్డుమార్గాన ములుగులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పి.శబరీశ్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్ జీ తదితరులు పూల మొక్కలు అందజేశారు. సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో మహిళలు, చిన్నారులు గవర్నర్‌కు స్వాగతం పలికారు. 11.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సుమారు ఏడున్నర గంటలపాటు ఆయన పర్యటన సాగగా, లక్నవరం ఐలాండ్‌లోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన రాత్రి బస చేశారు.

గిరిజన, ఆదివాసీ పథకాల అమలుపై సమీక్ష

గవర్నర్ వర్మ ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అధికారులు జిల్లా సమగ్రాభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ, గిరిజనుల కోసం అమలవుతున్న పథకాలపై ఆరా తీసిన గవర్నర్.. ఆయా వర్గాల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. జిల్లాలో వినూత్నంగా కంటైనర్ హాస్పిటల్ ఏర్పాటు చేయడంపై మంత్రి సీతక్కను ప్రత్యేకంగా అభినందించారు.

కోటగుళ్లలో శిల్పాన్ని పరిశీలిస్తున్న గవర్నర్



కోటగుళ్లలో..

రామప్ప నుంచి గవర్నర్.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల గణపేశ్వరాలయానికి వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఘన స్వాగతం పలికారు. తవ్వకాల్లో బయటపడ్డ శిల్పాలను గవర్నర్ పరిశీలించారు. కాకతీయుల వైభవాన్ని చాటే గొప్ప కట్టడం గణపేశ్వరాలయం అని, సుమారు 12వ శతాబ్దంలో కాకతీయులు ఓరుగల్లు ప్రాంతాన్ని పాలించిన సమయంలో ప్రజల సౌకర్యార్థం అద్భుతమైన కట్టడాలను నిర్మించారని తెలిపారు. అక్కడి నుంచి గోవిందరావు పేట మండలం లక్నవరం సరస్సుకు చేరుకుని అక్కడే రాత్రి బస చేశారు. గవర్నర్ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ భద్రత, బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు, రేపు కూడా గవర్నర్ పర్యటన వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో కొనసాగనుంది.

గవర్నర్ అభినందనలు

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గవర్నర్ వర్మ జిల్లాకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు, జాతీయ, అంతర్జాతీయ క్రీడా అవార్డు గ్రహీతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ అయ్యారు. మధ్యాహ్న భోజనం వారితోనే చేశారు. జిల్లాకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంపై అభినందనలు తెలిపారు.

రామప్పలో పూజలు

కలెక్టరేట్‌లో సమావేశం ముగించుకున్న గవర్నర్ నేరుగా రామప్ప ఆలయానికి చేరుకోగా, ఆలయ వేద పండితులు ఘన స్వాగతం పలికారు. రామలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని శిల్పాలను తడిమి చూశారు.

మేడారానికి జాతీయ హోదా కల్పించేలా చూడాలి : మంత్రి ధనసరి సీతక్క



తొలిసారి జిల్లా పర్యటనకు గవర్నర్ రావడంపై జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ధనసరి సీతక్క.. మేడారం మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించేలా తగు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. ములుగు జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తరణ ఉందని, 30 శాతం మంది ఆదివాసీలు, గిరిజన ప్రజలు ఈ జిల్లాలో నివసిస్తున్నారన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో నివసిస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

నీటిపై తేలియాడే ఇటుకను ప్రత్యక్షంగా ప్రొఫెసర్ పాండురంగారావు వివరించారు. ఆలయ చరిత్ర, శిల్ప సంపద విశిష్టతను గైడ్ విజయ్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మీడియాతో మాట్లాడుతూ.. రామప్ప దేవాలయ నిర్మాణం మహా అద్భుతమని, శిల్ప సంపద రమణీయమని కితాబిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ బలరాం నాయక్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం, టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ పాల్గొన్నారు.



రామప్ప ఆలయంలో పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క

'హైడ్రా' తరహాలో 'వాడ్రా' కావాలి

ఫోరం ఫర్ బెటర్ వరంగల్ సమావేశంలో తీర్మానం

హన్మకొండ అర్బన్: వరంగల్ నగరంలోని చెరువులు, నాలాల రక్షణకు హైదరాబాద్ 'హైడ్రా' తరహా.. వరంగల్‌కు 'వాడ్రా' వంటి స్వతంత్ర వ్యవస్థ అవసరమని ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ అన్నారు. మంగళవారం నగరంలోని టీజీఓ భవన్‌లో ఆసంస్థ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ ఆధ్వర్యంలో పౌర సంఘాలు, మేధావులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలాలపై ఉన్న ఆక్రమణలన్నీ తొలగిస్తూ.. అదే సమయంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనాలకు భంగం కలుగకుండా వాడ్రాలో నిబంధనలు రూపొందించాలన్నారు. వాడ్రా నివేదిక ఎలా ఉండాలో వివరిస్తూ డాక్యుమెంట్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు, అధికారుల ఒత్తిళ్లకు తలొగ్గని విధంగా వాడ్రా నిర్మాణం ఉండాలన్నారు. వరదలకు కారణమవుతున్న నాలాల వెంట, చెరువుల శిఖంలో వెలిసిన పెద్ద ఆక్రమణలను సత్వరమే తొలగించాలన్నారు. ఈసందర్భంగా వాడ్రా ఏర్పాటు కోసం సమావేశంలో నాయకులంతా తీర్మానం చేసి ఆమోదించారు. సమావేశంలో పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, జన విజ్ఞాన వేదిక లక్ష్మారెడ్డి, తిరునహరి శేషు, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధులు పెరుమాళ్ల లక్ష్మణ్, శ్రవణ్‌కుమార్, వేణు, ప్రొఫెసర్ విజయబాబు, అనుమాండ్ల విద్యాసాగర్, యాదగిరి, రాజ్‌మోహన్‌రావు, మండల పరశురాములు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్

సంప్రదాయానికి ప్రతీక తీజ్: ఎంపీ ఈటల

హన్మకొండ: బంజారాల సంప్రదాయానికి ప్రతీక, దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే అతి పెద్ద పండుగ తీజ్ అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో.. హనుమకొండ అశోకా కాలనీలోని గిరిజన భవన్‌లో నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాల్లో ఈటల రాజేందర్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి... సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి, నాయకులు ప్రొఫెసర్ ఆజ్మీర సీతారాం నాయక్, డాక్టర్ కాళీదాస్, ఎడ్ల అశోక్ రెడ్డి, మల్లాడి తిరుపతిరెడ్డి, బన్న ప్రభాకర్, కె.సంతోష్‌రెడ్డి, కందగట్ల సత్యనారాయణ, అమర్‌నాథ్ రెడ్డి, గోర్ బంజారా కమిటీ, తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు వి.ఎస్ నాయక్, వినోద్ లోక్ నాయక్, మదన్ నాయక్, వీరన్న, బానోతు వెంకన్న నాయక్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

హన్మకొండ అర్బన్/హన్మకొండ కల్చరల్/ఖిలా వరంగల్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈమేరకు మంగళవారం అధికారులు హనుమకొండ కలెక్టరేట్‌లో, వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో.. ఖిలా వరంగల్ కోటలో వరంగల్ కలెక్టర్ సత్యశారద బ్యాటరీ వాహనంపై తిరిగి ఏర్పాట్లను పరిశీలించారు. కాగా.. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు గవర్నర్ పద్మాక్షి అమ్మవారిని దర్శించుకోనున్నట్లు ఆలయ అర్చకుడు నాగిళ్ల శంకర్ శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని ఈవీఎంల గోదాములను వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం సందర్శించారు. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను గోదాముల్లో భద్రపరిచిన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలు, రికార్డులు, సీసీ కెమెరాలు, వాచ్ రూంలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి ఫోన్ ఇన్

జ్వర పీడితులకు మెరుగైన వైద్యం

ప్రతీరోజు 90 మందికి పైగా ఇన్‌పేషెంట్లు

- డెంగీ చికిత్సకు అందుబాటులో ప్లేట్‌లెట్స్, రక్త నిధి నిల్వలు
- విష జ్వరాల బాధితులకు రెండు ప్రత్యేక వార్డులు
- పూర్తిస్థాయి రక్త పరీక్షల నివేదికలతో చికిత్సలు
- 'సాక్షి ఫోన్ ఇన్'లో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి



ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ మురళి

ఎంజీఎం: 'పేదలకు పెద్ద దిక్కుగా భావించే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో విష జ్వరాలతోపాటు డెంగీ, మలేరియావంటి వ్యాధులతో వచ్చే వారి కోసం అన్ని రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉంచాం. జ్వర పీడితుల కోసం ప్రత్యేక ఓపీ విభాగంతోపాటు వయో వృద్ధుల ఓపీ సేవలను అందుబాటులోకి తెచ్చాం. ఇటీవల ఓపీ విపరీతంగా పెరిగింది. ప్రతీ రోజు 90 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్న వారిని అడ్మిట్ చేసుకుంటూ చికిత్స అందిస్తున్నాం. డెంగీ అనుమానితులుగా భావిస్తున్న వారి రక్త పరీక్షలు చేస్తున్న క్రమంలో ప్రతి 50 నమూనాల్లో ఒకటి లేదా రెండు పాజిటివ్‌గా నిర్ధారణ అవుతున్నాయి.' అని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి తెలిపారు. ఎంజీఎంలో అందుతున్న వైద్యసేవలతోపాటు విష జ్వరాలతో బాధపడుతున్న పలువురు బాధితుల సందేహాలకు మంగళవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పలువురు నేరుగా ఎంజీఎం సూపరింటెండెంట్ మురళితో మాట్లాడి తమ సందేహాల్ని నివృత్తి చేసుకున్నారు. విషజ్వరాలు, మలేరియా, డెంగీ వ్యాధి నిర్ధారణ, ముందస్తు జాగ్రత్తలపై వారికి ఆయన సలహాలు, సూచనలను అందించారు.

ప్రశ్న : వారం రోజులుగా జ్వరం వస్తోంది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– జాన్, పాత ముగ్దుంపురం, చెన్నారావుపేట

డాక్టర్: జ్వర పీడితులు దగ్గర్లో ఉన్న ప్రభుత్వాస్పత్రిని సందర్శించి వైద్యుడి సలహా మేరకు మందులు వాడండి. పీహెచ్‌సీ పరిధిలో పూర్తి స్థాయి రక్త పరీక్షలు జరగకపోతే ఎంజీఎం ఆస్పత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : నాలుగు రోజులుగా తీవ్ర ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నా. ఎలాంటి చికిత్సలు తీసుకోవాలి ?

– సికిందర్‌రాజు, ఖానాపురం

డాక్టర్: జ్వర పీడితులకు సాధారణంగా ఒళ్లు నొప్పులు వస్తుంటాయి. వైద్యుడి సలహా మేరకు యాంటీబయాటిక్స్‌తో కూడిన మెడిసిన్ వాడండి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగండి. జ్వరం తగ్గకుండా అలాగే ఉంటే ఎంజీఎంలో అడ్మిట్ అయితే.. పూర్తి స్థాయిలో రక్త పరీక్షలు నిర్వహించి అన్ని రకాల చికిత్సలు అందిస్తాం.

ప్రశ్న : డెంగీ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– కిషన్‌రావు, నడికూడ(మ) నర్సక్కపల్లి

డాక్టర్: దోమల ద్వారా విష జ్వరాలు వ్యాపిస్తాయి. అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే.. వర్షకాలం సీజన్‌లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల్ని సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలి. బయటి ఆహారం తినకుండా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి.

ప్రశ్న : వృద్ధులు ఎంజీఎంలో చికిత్సలు పొందాలంటే ఇబ్బందిగా ఉంది. ఏమైనా ప్రత్యేక చర్యలు చేపట్టారా సార్?

– గోక రాజ్‌కుమార్, వెంకటాపురం, దుగ్గొండి

డాక్టర్: ఎంజీఎం ఆస్పత్రిలో 55 ఏళ్ల పైబడిన వారు ఏ వ్యాధితో బాధపడుతూ వచ్చినా వారికోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం ఏర్పాటు చేశాం. ఈ విభాగం సాధారణ ఓపీ విభాగం షెడ్డు ఎదురుగా ఉన్న ప్రత్యేక షెడ్డులో కొనసాగుతోంది. ఇక్కడ వృద్ధులు ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణమే వైద్య చికిత్సలు పొందవచ్చు.

ప్రశ్న : జ్వరంతో పాటు ఒళ్లునొప్పులు, దగ్గు, తెమడ వంటి వాటితో బాధపడుతున్నాను. ఎలాంటి చికిత్సలు తీసుకోవాలి సార్?

– సుమన్, రాయపర్తి

డాక్టర్: విష జ్వరాలతో బాధపడుతున్న వారికి ఒళ్లు నొప్పులు సాధారణం. వైద్యుడి సలహా మేరకు చికిత్స తీసుకోవాలి. దగ్గు, తెమడ వంటి వాటికి ప్రత్యేక ఔషధాలు వాడాలి. పూర్తి స్థాయి రక్త పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు పొందాలి.

ప్రశ్న : సార్ మా మండలంలో విష జ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉంది. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి.

– భట్టు సాంబయ్య, నల్లబెల్లి, రంగాపురం

డాక్టర్: వైద్యారోగ్యశాఖ పరిధిలో జూన్ 25వ తేదీ నుంచి జ్వర పీడితుల కోసం ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేపట్టింది. మీ మండల పరిధిలో ఉన్న అనేక గిరిజన తండాల్లో అక్కడి పరిస్థితులకు అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు. ఎంజీఎం ఆస్పత్రికి ఏ ప్రాంతం నుంచి కేసులు ఎక్కువ నమోదవుతున్నా.. వివరాలను రాష్ట్రస్థాయి అధికారులతో పాటు కలెక్టర్‌కు ప్రత్యేకంగా పంపిస్తున్నాం. మీ ప్రాంతం నుంచి జ్వర పీడితులు ఎక్కువగా వస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న : ఎంజీఎం ఆస్పత్రిలో జ్వర పీడితుల కోసం ప్రత్యేక వార్డులు ఉన్నాయా? అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా?

– కుమారస్వామి, కొత్తూరు, ఖానాపురం

డాక్టర్: ఎంజీఎం ఆస్పత్రిలో జ్వర పీడితుల కోసం ప్రత్యేక ఓపీతో పాటు రెండు ప్రత్యేక వార్డులు సైతం ఏర్పాటు చేశాం. ఆస్పత్రిలో ప్రతీ రోజు వందలాది మంది జ్వర పీడితులు చికిత్సలు పొందుతున్నారు. ఈక్రమంలో సాధారణ ప్రజలతో పాటు చిన్నపిల్లల విభాగంతో కలిపి 90 మందికిపై జ్వర పీడితులను ఎంజీఎంలో అడ్మిట్ చేసుకుంటూ ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నాం. ఎంజీఎం ఆస్పత్రిలో అన్ని రకాల ఔషధాలతో పాటు రక్త పరీక్షలు నిర్వహిస్తూ పూర్తి స్థాయిలో చికిత్సలు అందిస్తున్నాం.

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయండి

- 9న సీఎం చేతుల మీదుగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం
- సీడీఎంఏ గౌతమ్.. క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన



నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీడీఎంఏ గౌతమ్

నయీంనగర్: 'కుడా', జీడబ్ల్యూఎంసీ పరిధిలో కొనసాగుతున్న పనుల పురోగతిని సీడీఎంఏ (కమిషనర్ ఫర్ డెరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) టిపి.గౌతమ్ మంగళవారం పరిశీలించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం కుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉనికిచర్ల యునీ సిటీ వెంచర్, మడిపల్లి మా సిటీ వెంచర్, వరంగల్ ఓ సిటీ వెంచర్, ఇన్నర్‌రింగ్ రోడ్, కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ నాలా, హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్ని ఆయన పరిశీలించారు. కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించి పనులు తుది దశకు చేరుకున్నాయని సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా కళాక్షేత్రాన్ని, నయీంనగర్ బ్రిడ్జిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 'కుడా' కార్యాలయంలో ఆయన గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ సత్య శారద, జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడేతో సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. కుడా, జీడబ్ల్యూఎంసీ పరిధిలో వివిధ పథకాల కింద కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే మొదలైన పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, సీపీఓ అజిత్‌రెడ్డి, హెచ్ఓ రమేశ్, ఈఈ భీంరావు, ఏఈలు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ఈనెల 28న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు హనుమకొండలోని వరంగల్–1 డిపో నుంచి ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, పాలకుర్తి, తొర్రూరు, తరిగొప్పుల రూట్ ప్రయాణికులు 99592 26047 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలివ్వాలని కోరారు.

క్లుప్తంగా

1న జిల్లాస్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ -11 బాలబాలికలకు సెప్టెంబర్ 1వ తేదీన చెస్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి పి.కన్నా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ పోటీలకు 2013, జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. క్రీడాకారులు తప్పనిసరిగా వెంట చెస్ బోర్డు తీసుకుని రావాలని, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

1న సబ్ జూనియర్స్ ఖోఖో ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో ఎంపిక పోటీలు సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 98492 10746, 79892 03044 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

31 వరకు గడువు పెంపు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2024–25 సంవత్సరానికి ఆలస్య రుసుముతో ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రవేశానికి ఈ నెల 24తో గడువు ముగిసింది. కాగా విద్యార్థుల విజ్ఞప్తుల మేరకు రూ.100ల ఆలస్య రుసుముతో ఈ నెల చివరి వరకు గడువు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భుక్యా బాబురావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రతీ జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలి



హన్మకొండ : హైడ్రా తరహా ప్రత్యేక వ్యవస్థను రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేయాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో దామోదర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన హైడ్రా వ్యవస్థను స్వాగతిస్తున్నామని, హైడ్రా నిష్పక్షపాతంగా అక్రమ కట్టడాలను కూల్చివేయడాన్ని వినియోగదారుల సంఘాల పక్షాన అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ వరంగల్, హనుమకొండలోని దేవాలయ భూముల పరిరక్షణను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పద్మాక్షి, సిద్ధేశ్వరస్వామి దేవాలయ భూములతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 890/బీలో ఉన్న 56.19 ఎకరాల భూమి కబ్జా అవుతుందని, భద్రకాళీ చెరువులోని 10 సర్వే నంబర్‌లోని భూమి మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండటం వల్ల అక్రమ కబ్జాలు జరుగుతున్నాయన్నారు. న్యాయవాదులు హైమవతి, శ్రీదేవి, సంఘం సభ్యులు రావుల రంజిత్ కుమార్, కవిరాజు, ఇందిర, జ్యోత్స్న, సతీష్ పాల్గొన్నారు.



బీసీఐ అనుమతి నిరాకరణ

ఫీజు చెల్లింపులో వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం?

- వెబ్ ఆప్షన్‌లో కనిపించని కేయూ న్యాయ కళాశాల పేరు
- ఈ ఏడాది అభ్యర్థులకు తప్పని నిరాశ

కేయూ క్యాంపస్ : నాలుగు దశాబ్దాల క్రితం కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాలను(లా కాలేజీ) హనుమకొండలోని సుబేదారిలో ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు న్యాయ కళాశాల అనేక సమస్యలతో సతమతమవుతోంది .యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతో సకాలంలో గ్యారంటీ డిపాజిట్ ఫీజు చెల్లించడంలో జాప్యం జరిగింది. అంతేగాకుండా రెగ్యులర్ అధ్యాపకుల కొరత.. 14మంది పార్ట్‌టైం అధ్యాపకులు ఉన్నారు. అంతేగాకుండా మూట్ కోర్టు ఉన్నా కూడా వినియోగించుకునే స్థితి లేకపోవడంతో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) యూనివర్సిటీ లా కాలేజీకి ఈ విద్యాసంవత్సరం (2024–25)లో ప్రవేశాలకు అఫ్లియేషన్ అనుమతి ఇవ్వలేదు. అలాగే బీసీఐ విడుదల చేసిన లా కళాశాలల జాబితాలో కేయూ లా కాలేజీ పేరు లేదు. దీంతో యూనివర్సిటీ లా కాలేజీలో ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులకు నిరాశే ఎదురైంది.

వర్సిటీ అధికారుల నిర్లక్ష్యమేనా?

మిగతా లా కాలేజీల్లాగానే కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాలకు కూడా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు వర్తిస్తాయి. 2024–25విద్యాసంవత్సరంలో లాసెట్ ప్రవేశాలకు సంబంధించి కూడా బార్‌కౌన్సిల్ ఇండియా నుంచి అఫ్లియేషన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు ప్రతికోర్సుకు ఫీజు రూ.3లక్షలు చొప్పున మూడేళ్ల లా కోర్సు, ఐదేళ్ల లా కోర్సుకు కలిపి రూ.6లక్షలు, తనిఖీ ఫీజు రూ.50వేలు మొత్తం చెల్లించారు. అయితే గ్యారంటీ డిపాజిట్‌గా(కాషన్ డిపాజిట్) కూడా రెండు కోర్సులు కలిపి రూ.10 లక్షలు చెల్లించాల్సిండగా ఇది ప్రభుత్వ యూనివర్సిటీ లా కాలేజీ కదా అని ఆ ఫీజును బీసీఐకి చెల్లించడంలో యూనివర్సిటీ అధికారులు కొంత జాప్యం చేశారు. ఈ డిపాజిట్ ఫీజును ఇటీవలనే బీసీఐకి చెల్లించారు. ఆలస్యంగా చెల్లించినట్లు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మంగళవారం ధ్రువీకరించారు. బార్ కౌన్సిల్ అనుమతినిస్తూ విడుదల చేసిన లా కళాశాలల జాబితాలో కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీ పేరు లేకపోవడంతో యూనివర్సిటీ అధికారులు కంగుతిన్నారు. రెగ్యులర్ అధ్యాపకులు లేరని అనుమతి ఇవ్వలేదని సమాచారం అందిందని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అంటున్నారు.



కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీ భవనం

యూనివర్సిటీ లా కాలేజీలో బీసీఐ తనిఖీ

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) నుంచి ఐదుగురు సభ్యుల బృందం ఈ ఏడాది జూలై 22న హనుమకొండలోని యూనివర్సిటీ లా కాలేజీని సందర్శించి తనిఖీ చేశారు. యూనివర్సిటీ లా కాలేజీలో ఏడు అధ్యాపక పోస్టులు ఉండగా ప్రస్తుతం రెగ్యులర్ అధ్యాపకులలో ఒకరు ప్రొఫెసర్, మరొకరు అసోసియేట్ ప్రొఫెసర్, ఇంకొకరు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉన్నారు. 14మంది పార్ట్‌టైం అధ్యాపకులు పనిచేస్తున్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా లా కాలేజీలోని సదుపాయాలను తనిఖీ చేసినట్లు సమాచారం. మరోవైపు గ్యారంటీ డిపాజిట్ ఫీజు ఆలస్యంగా చెల్లించడం.. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలా లా కళాశాలకు బీసీఐ అనుమతి ఇవ్వలేదని వివిధ విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అనుమతి వచ్చేలా చేయాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు షురూ..

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల పరిధిలో ఈ విద్యాసంవత్సరంలో మూడేళ్ల, ఐదేళ్ల లా కోర్సుల్లో ప్రవేశాలకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఇటీవల పూర్తయింది. వెబ్ ఆప్షన్లు మంగళవారం నుంచి మొదలైంది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన జాబితాలో కేయూ లా కళాశాల పేరు లేదు. కాబట్టి మొదటిదశ కౌన్సిలింగ్‌లో కేయూ లా కాలేజీకి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. మూడేళ్ల లా కోర్సులో 60 సీట్లు, ఐదేళ్ల లా కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. లాసెట్‌లో ఉత్తీర్ణతలో మెరిట్ వచ్చిన వారు సాధారణంగా వర్సిటీ లా కాలేజీలో ప్రవేశాలు పొందాలనుకుంటారు.. అలాంటి వారికి నిరాశే ఎదురైంది. రెండోదశ ప్రవేశాలవరకైనా అనుమతివస్తుందా లేదా అనేది వేచి చూడాల్సిందే.

అనుమతి వస్తుందని భావిస్తున్నాం

కేయూ లా కాలేజీకి బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అఫ్లియేషన్ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం. చెల్లించాల్సిన ఫీజులు చెల్లించడంతోపాటుగా అఫిడెవిట్‌ను సబ్‌మిట్ చేశాం. ఒకటి, రెండ్రోజుల్లో అనుమతి రావొచ్చని భావిస్తున్నాం. రెగ్యులర్ అధ్యాపకులు లేరని పేర్కొంటున్నారని సమాచారం ..అయితే ప్రొఫెసర్లను ప్రభుత్వం నియమించాల్సి ఉంటుంది. అడ్మిషన్లకు సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువును కూడా పెంచాలని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– డాక్టర్ సుదర్శన్, కేయూ లా కాలేజీ ప్రిన్సిపాల్

రాజీనామా చేయాలి

రాష్ట్రంలోని లా కాలేజీల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. అయితే ఈ ఏడాది ప్రవేశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) కేయూ లా కాలేజీకి అనుమతి ఇవ్వలేదని అందుకు బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్, లా కాలేజీ ప్రిన్సిపాల్, బీఓఎస్, డీన్ ఆయా పదవులకు రాజీనామాలు చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, పీడీఎస్‌యూ హనుమకొండ నగర అధ్యక్షుడు రంజిత్ డిమాండ్ చేశారు. బీసీఐ విడుదల చేసిన జాబితాలో యూనివర్సిటీ లా కాలేజీ లేకపోవడంతో ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. యూనివర్సిటీ అధికారులు, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా అనుమతి వచ్చేలా కృషిచేయాలని వారు డిమాండ్ చేశారు.న్యాయ కళాశాల విద్యార్థులు అరుణ్, రాకేష్, ఉదయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- కుక్టా జాక్ కో కన్వీనర్ డాక్టర్ సాధు రాజేశ్

కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని ఆయా యూనివర్సిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కుక్టా జాక్ కన్వీనర్ డాక్టర్ సాధు రాజేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కుక్టా జాక్ బాధ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. 1,445 మంది ఏళ్ల తరబడి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారని వివరించారు. విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు యూజీసీ పే స్కేల్స్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వస్తే తమఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయనే ఆశతో ఉన్నారని తెలంగాణ వచ్చిన తర్వాత కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను విస్మరించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. 15 రోజుల్లో వీసీలను నియమిస్తామని సీఎం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో జాక్ బాధ్యులు డాక్టర్ ఫిరోజ్ పాషా, మాదాసి కనకయ్య, మామిడి లింగయ్య, లక్ష్మారెడ్డి, జూల సత్య, చందులాల్, రాజు, సునీత, రాజేశ్వరి, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాధు రాజేశ్

కాంట్రాక్టు ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

రాష్ట్రంలోని యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో తూర్పాటి వెంకటేష్, సంతీత్‌కుమార్, శశిధర్, సాయితరుణ్, సుకన్య, బ్లెస్సీ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

మక్కలు @ రూ.2,885



వరంగల్ : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న క్వింటాకు రూ.2,885గా ధర పలికింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన రైతు బరిగెల సంజీవ్ సుమారు 30 క్వింటాళ్ల మొక్కజొన్నలు విక్రయానికి మార్కెట్‌కు తీసుకరాగా ప్రేమ్ అడ్తి షాపు ద్వారా సంధ్య ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ఘరానా మోసం

- వ్యాపారిని బెదిరించి రూ.88 వేలు కాజేసిన కేటుగాళ్లు

పాలకుర్తి టౌన్ : సైబర్ నేరస్తుల ఉచ్చులో పడి జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి మోసపోయాడు. పోలీసులమని చెబుతూ..అమెరికాలోని మీ కుమారుడు కారుతో ఒకరికి యాక్సిడెంట్ చేశాడని, గాయపడిన వారికి చికిత్స చేయాల్సి ఉందని చెప్పారు. కేసు కాకుండా చూసుకుంటామని, వెంటనే రూ.3 లక్షలు పంపాలని బెదిరించారు. ఆందోళనకు గురైన బాధితుడు 'నేను కనుక్కోని డబ్బులు పంపుతా'నని తెలిపిన సైబర్ నేరగాళ్లు వినలేదు. మూడు గంటల పాటు బాధితుడితో కాల్‌లోనే ఉండి సతాయించారు. డబ్బులు పంపకుంటే మీ కుమారుడిని కాల్చివేస్తామని హెచ్చరించారు. కుమారుడు మాట్లాడినట్లుగా ఓ రికార్డును బాధితుడికి వినిపించగా నిజమే అనుకోని వెంటనే రూ.88వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం కాల్ కట్ చేసి అమెరికాలో ఉన్న తన కుమారుడికి ఫోన్ చేయగా యాక్సిడెంట్ చేయలేదని చెప్పడంతో మోసపోయనని బాధితుడు గుర్తించాడు. ఈఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. మండలంలో 10 మందికి సైతం సైబర్ నేరగాళ్ల 92 సిరీస్ నుంచి కాల్స్ వచ్చినట్లు సమాచారం.

ఒద్దిరాజు సోదరులకు గుర్తింపు రాలేదు



సమావేశంలో మాట్లాడుతున్న దేవులపల్లి అమర్

- ఐజేయూ జాతీయ కార్యదర్శి దేవులపల్లి అమర్

కేసముద్రం : తెనుగు పత్రికను స్థాపించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన ఒద్దిరాజు సోదరులకు తగిన గుర్తింపు రాలేదని సీనియర్ జర్నలిస్ట్, ఐజేయూ జాతీయ కార్యదర్శి దేవులపల్లి అమర్ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు స్థాపించిన తెనుగు పత్రిక శతాబ్ది వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఇనుగుర్తిలో ఒద్దిరాజు సోదరులు ముద్రణాలయం ఏర్పాటు చేసి, పత్రికను ముద్రించి ఇతర ప్రాంతాలకు సర్క్యులేషన్ చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. హైదరాబాద్ టాంక్‌బండ్‌పై ఒద్దిరాజు సోదరుల విగ్రహల ఏర్పాటుకు కృషి చేయాలని, అలాగే మహబూబాబాద్ జిల్లాకు వారి పేరు పెట్టే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. మీడియా ఎ డ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ని ర్వహించే కార్యక్రమంలో ఒద్దిరాజు సోదరుల చ రిత్రను చేరుస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే విలేకరులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తె లిపారు.గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, ట్రస్ట్ చైర్మన్ సుభాష్‌చంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

విద్యా కార్యక్రమాలన్నింటినీ అమలు చేయండి

- ఇన్‌స్పైర్ నామినేషన్ల రిజిస్ట్రేషన్ చేయించండి
- అధికారులతో డీఈఓ వాసంతి సమీక్ష



మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: జిల్లాలోని విద్యా కార్యక్రమాల్లో వెనుకబడి ఉండకూడదని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాల్సిన అన్నింటినీ అమలు చేయాలని హనుమకొండ డీఈఓ వాసంతి కోరారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో ఎంఈఓలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ఏఎస్ఓ విజయకుమార్, ఏపీఓ వినయ్‌కుమార్, ఎంఈఓలు రాంకిషన్‌రాజు, రమాదేవి, రవీందర్, వెంకటేశ్వర్‌రావు డీఎల్ ఎంటీ రఘు తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

ఈనెల 29న జిల్లా స్థాయిలో దివ్యాంగులకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష, అలీంకో ఆధ్వర్యంలో జిల్లా విద్యాశిక్షణ సంస్థలో నిర్వహించే ఈశిబిరంలో వైద్యులు పరీక్షించి అవసరమైన దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈశిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు యూడీఐడీ కార్డు లేదా.. యూడీఐడీ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్ : డిగ్రీ, PG, B.Tech., Diploma, D&B- ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339 [HA-16368]

REAL ESTATE

LAUNCHING OFFER (Limited Period)
వరంగల్ హైవే భువనగిరి దగ్గరలో చందుపట్ల గ్రా॥లో మా యొక్క నూతన వెంచర్ ప్రారంభోత్సవ కానుకగా 121 గజాల Farm Land కేవలం 10 లక్షలకే తీసుకోండి మరియు అదనంగా 20,000/-లను 24 నెలల వరకు రెంటల్‌ను పొందే గొప్ప అవకాశం త్వరపడండి
Free and Spot Registration
9440958008

PLOT FOR SALE

■ HNK, KITS College అంబాల రోడ్‌కు & ముచ్చర్ల రోడ్‌కు కొత్తగా వస్తున్న హైవే రోడ్‌కు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. సంప్ర॥ 9553255936. [W-1239955]

WANTED

■ PHARMACY BOYS, OPERATION Theater Boys & Receptionists / సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. సంప్ర॥ గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్ 12 to 2PM [WA-0420]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం 18K. ఫోన్: 9160900024, 9640400073 [H-796271]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉత్సాహంగా ఆహ్వానిత క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్ఓ సత్యవాణి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి

కాశిబుగ్గ: వరంగల్ ఓ సిటీ స్టేడియంలో వరంగల్ జిల్లాస్థాయి ఆహ్వానిత క్రీడాపోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, క్రికెట్, జూడో, రెజ్లింగ్ పోటీల్లో మొత్తం 42 జట్లు తలపడ్డాయని డీవైఎస్ఓ సత్యవాణి తెలిపారు. కోచ్‌లు లింగమూర్తి, కుమారస్వామి, మహేశ్ రవి, సిబ్బంది మౌనిక, రమేశ్, రాజేందర్, అహ్మద్, పాషా, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి..

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 29న వరంగల్ వెంకట్రామ జంక్షన్ నుంచి ఓ సిటీ స్టేడియం వరకు నిర్వహించనున్న ర్యాలీని క్రీడాకారులు, క్రీడాభిమానులు విజయవంతం చేయాలని వరంగల్ డీవైఎస్ఓ సత్యవాణి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి చేతుల మీదుగా క్రీడా దినోత్సవం పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు.

గెలుపే లక్ష్యంగా సభ్యత్వాలు పెంచాలి

- నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త

హన్మకొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సభ్యత్వాలు పెంచాలని బీజేపీ సీనియర్ నాయకుడు, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద బాంక్వెట్ హాల్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం–24 కార్యశాలను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇందులో సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతీ నాయకుడు, కార్యకర్త వంద మంది చొప్పున సభ్యత్వం చేయించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరాలంటే పార్టీ పటిష్టం కావాలన్నారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీలో చేరి వికసిత భారత్‌లో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కోసం 88000 02024 నంబర్‌కి మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, నాయకులు ఒంటేరు జైపాల్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పి.విజయచందర్‌రెడ్డి, డాక్టర్ కాళీప్రసాద్, రావుల కిషన్, గుజ్జ సత్యనారాయణ రావు, పులి సరోత్తంరెడ్డి, కొలను సంతోశ్‌రెడ్డి, ఆర్పీ జయంత్‌లాల్, దేశిని సదానందం గౌడ్, కొండి జితేందర్‌రెడ్డి, డి.అమర్‌నాథ్‌రెడ్డి, నర్మెట శ్రీనివాస్, రత్నా లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్త

నూతన వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం

- నాబార్డు సీజీఎం చింతల సుశీల

ఐనవోలు: వాతావరణ పరిస్థితులను తట్టుకుని, నూతన వ్యవసాయ సాగు పద్ధతులను ప్రోత్సాహిస్తున్నట్లు నాబార్డు సీజీఎం చింతల సుశీల తెలిపారు. తెలంగాణ వాతావరణ మార్పు నిధి–వడ్డీ భేదం కింద వరంగల్, హనుమకొండ జిల్లాలో నాబార్డు మద్దతు ఉన్న మూడు రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీఓ)కు పైలెట్ ప్రాజెక్టును మంజూరు చేసినట్లు నాబార్డు సుశీల చెప్పారు. మంగళవారం మండలంలోని రాంనగర్ రైతు వేదిక వద్ద పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన డ్రోన్లను సీజీఎం సుశీల, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఎఫ్‌పీఓ సభ్యులకు పంపిణీ చేసి ప్రాజెక్టును ప్రారభించి ఆమె మాట్లాడారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పంటలకు పిచికారీ చేసే డ్రోన్స్ పంపిణీ చేయడం వల్ల ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. అంతకు ముందు నాబార్డ్ సీజీఎం సుశీల ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే నందనం బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన మొబైల్ ఏటీఎంను ఆమె ప్రారంభించారు. నాబార్డ్ డీజీఎం స్వాతి తివారి, డీడీఎం చంద్ర శేఖర్, ప్రతాపరెడ్డి, ఏడీ ఉమారెడ్డి, సీసీఎక్స్ సీఈఓ నీరజ్, రాజేశ్వర్, డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న నాబార్డ్ సీజీఎం సుశీల, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్

హలో.. నేను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ను..

- మత్స్యశాఖ అధికారి నరేశ్‌కుమార్ నాయుడికి ఫేక్ ఫోన్‌కాల్
- అక్రమ ఆస్తులున్నాయని ఫిర్యాదు వచ్చింది.. రూ.3 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోండని బెదిరింపు
- సుబేదారి పోలీసులకు అధికారి ఫిర్యాదు

గీసుకొండ : 'హలో నా పేరు నాయుడిగారి సురేంద్రకుమార్..హైదరాబాద్ ఏసీబీ హెడ్ ఆఫీసులో ఎంక్వయిరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నా.. మీరు అక్రమంగా ఆస్తులు కూడగట్టారని ఫిర్యాదులు వచ్చాయి.. విచారణ కూడా అయిపోయింది. దాడులకు పంపుతున్నా.. ఏదైనా సెటిల్ చేసుకోండి.. రూ.3 లక్షలు ఇస్తే మీపైన చర్యలు ఉండవు. లేదంటే బ్లాక్‌లిస్టులో పెడతా' అంటూ సోమవారం మత్స్యశాఖ అధికారి నరేశ్‌కుమార్ నాయుడికి ఫేక్ ఫోన్ కాల్ వచ్చింది. నరేశ్‌కుమార్ నాయుడు ఇటీవల వరంగల్ నుంచి పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన ఇంకా వరంగల్‌లోనే పని చేస్తున్నాడని భావించి కాల్ చేయడంతో అతడి కాల్‌ను అధికారి రికార్డు చేశారు. దీనిపై ఏసీబీ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. తన ఫోన్‌ను కట్ చేయకుండా హోల్డ్‌లో పెట్టకుండా తక్షణమే డబ్బు ఫోన్ పే ద్వారా పంపించాలని సదరు వ్యక్తి కోరగా అంత మొత్తం తన వద్ద లేదని ఒక గంట సమయం ఇస్తే రూ.లక్ష చెల్లిస్తానని నరేశ్‌కుమార్ నాయుడు చెప్పడంతో అతడు సంతృప్తి చెందకుండా మీ పేరును బ్లాక్ లిస్టులో పెడుతున్నాని కాల్‌కట్ చేశాడు. ఇలా మత్స్యశాఖకు సంబంధించి పలు జిల్లాలకు చెందిన ఎనిమిది మంది మత్స్యశాఖ అధికారులకు సదరు వ్యక్తి కాల్ చేసినట్లు నరేశ్‌కుమార్ నాయుడు తెలిపారు. తనకు కాల్ రాగానే కట్ చేయడంతో సదరు వ్యక్తి మళ్లీ ఫోన్ చేశాడని. అనుమానం వచ్చి రికార్డు చేశానని, ఈ విషయమై ఏసీబీ అధికారులు తనతో మాట్లాడారని, మంగళవారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆయన సాక్షితో తెలిపారు. ఇటీవల మహబూబాబాద్ నుంచి వరంగల్‌కు బదిలీపై వచ్చిన జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణికి ఇదే తరహాలో సదరు వ్యక్తి కాల్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడని చెబుతున్నారు. ఇలాంటి ఫేక్ కాల్స్‌ను అధికారులు ఎవరూ నమ్మవద్దని, అలాంటివి ఏమైనా వస్తే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలంటూ హైదరాబాద్‌లోని స్టేట్ ఏసీబీ కార్యాలయ అధికారులు ప్రకటనలో తెలిపారు.

ఫోర్ట్‌రోడ్డులో అగ్ని ప్రమాదం

జయ గన్నీమర్చంట్, ఎస్.కే ఓల్డ్ ఫర్నిచర్ షాపుల్లో ఎగిసిపడిన మంటలు

- కాలిబూడిదైన ఓల్డ్ ఫర్నిచర్, యంత్రాలు, గన్నీబ్యాగులు
- సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసిన ఫైరింజన్లు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఖిలా వరంగల్ : వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌నా లేదా ఆకతాయిలు కాల్చిపడేసిన సిగిరేట్ వల్ల అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో జయ గన్నీస్ మర్చంట్, ఎస్.కే ఓల్డ్ ఫర్నిచర్ షాపుల్లో వేర్వేరుగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షలమేర పాత ఫర్నిచర్, యంత్రాలు, గన్నీ బ్యాగులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానికులు, బాధితులు, అధికారుల కథనం ప్రకారం.. వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్ శివనగర్‌లో పాత గోదాం, ఖాళీ స్థలంలో వీరెడ్డి(ఉరుటి) వీరస్వామి అతడి కుమారుడు రవి ఇద్దరు కలిసి జయ గన్నీస్ మర్చంట్ షాపు నిర్వహిస్తున్నారు. అలాగే శాకరాశికుంటకు చెందిన ఎస్.కే రబ్బాని అతడి కుమారుడితో కలిసి ఎస్.కే ఓల్డ్ ఫర్నిచర్ షాపును ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజు మాదిరిగా సోమవారం రాత్రి యజమానులు షాపులకు తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున జయ గన్నీస్ మర్చంట్, ఎస్.కే ఓల్డ్ ఫర్నిచర్ షాపులలో ప్రమాదవశాత్తు అగ్గిరాజుకుంది. షార్ట్‌సర్క్యూట్ కారణమా లేక మద్యం మత్తులో ఆకతాయిలు కాల్చిపడేసిన సిగరెట్ వల్లనా తెలియదు. ఒక్కసారిగా తట్టుబస్తాలు (గన్నీ బ్యాగులు) ఓల్డ్ ఫర్నిచర్, యంత్రాలకు మంటలు అంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో మంటలు వేగంగా పక్కనే ఉన్న సాయిశ్రీనివాస గ్లాస్, ప్లైవుడ్, హార్డ్‌వేర్ షాపునకు వ్యాపించాయి. దట్టమైన పొగతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గమనించిన స్థానికులు స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మిల్స్ కాలనీ పోలీసులతోపాటు వరంగల్ ఫైర్ అధికారులకు వేర్వేరుగా సమాచారం ఇచ్చారు. వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, వరంగల్, గొర్రెకుంట, హనుమకొండ, వర్ధన్నపేటకు చెందిన అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేందుకు ఫైరింజన్లతో పాటు 15 మంది సిబ్బంది విశ్వప్రయత్నం చేశారు. ఉదయం 4:30 నుంచి 10:30 గంటల వరకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ సుమారు రూ.15లక్షల విలువైన గన్నీ బ్యాగులు, రూ.5లక్షల విలువైన ఓల్డ్ ఫర్నిచర్, పనిముట్లు, యంత్రాలు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. సుమారు రూ.30లక్షలకు పైగా ఆస్తి కాలిపోకుండా కాపాడినట్లు వరంగల్ అగ్నిమాపక శాఖ డీఎఫ్ఓ శ్రీధర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ ఫైర్ అధికారులు రాజశ్వర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి ఆర్థికంగా నష్టపోయి వీధిన పడ్డ వ్యాపారులను ప్రభుత్వం స్పందించి సాయం అందించి ఆదుకోవాలి.

– నరేందర్, మాజీ ఎమ్మెల్యే

అండగా ఉంటాం..

అధైర్య పడొద్దు అండగా ఉంటాం. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు న్యాయం జరిగేలా నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని రెవెన్యూ అధికారులను కోరా.

– కొండా మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ